# తెలివి నాది, పేరు నీది!

-బులుసు రాధాకృష్ణమూర్తి



"డాడీ! మా ప్రిన్సిపాల్‌గారు, కరస్పాండెంటుగారు వచ్చారు" రొప్పుకుంటూ వచ్చి చెప్పేడు రాజు.

"వస్తారు, వస్తారు. ఇప్పుడు కనబడతాం మనం వాళ్ళకి. వస్తున్నాను. కూర్చోమని చెప్పు" గెడ్డం గీసుకుంటూ చెప్పేరు రంగనాధరావుగారు.

గెడ్డం గీసుకోవడం ముగించి, హాలులో ప్రవేశిస్తున్న రంగనాధరావుగారిని చూసి, ప్రిన్సిపాల్‌గారు, కరస్పాండెంటుగారు లేచి నుంచుని "కంగ్రాచ్యులేషన్స్ సార్! మీ అబ్బాయికి రాష్ట్రంలో పదో ర్యాంకు వచ్చినందుకు మా తరఫున, మా కాలేజీ యాజమాన్యం తరఫున" ఇద్దరూ షేక్‌హ్యాండ్ ఇస్తూ చెప్పారు.

"థాంక్యూ! థాంక్యూ! కూర్చోండి" రంగనాధరావుగారు మర్యాదగా చెప్పేరు.

"మీ అబ్బాయికి అసలు ఇంకా మంచి ర్యాంకు వస్తుందని ఎక్స్‌పెక్ట్ చేసేం సార్! కొద్దిలో తప్పింది" చెప్పేరిద్దరూ ముక్తకంఠంతో.

"ఏదో భగవంతుడి దయవల్ల.."

"సార్! మాదో చిన్న విన్నపం. మీరు మరోలా అనుకోవద్దు. మీ ఇంటికి ప్రెస్‌వాళ్ళందరూ వస్తారు. 'మీరే కాలేజీలో చదివేరు? అక్కడ అధ్యాపకులెలా చెప్పేరు?' వగైరా ప్రశ్నలడుగుతారు. మీరు కొంచెం మీ అబ్బాయి చేత మా కాలేజీ గురించి మంచిగా చెప్పించారంటే..మాకు కొంత పబ్లిసిటీ ఇచ్చినవారవుతారు"

"ఏం చెప్పమంటారు?" అడిగేరు రంగనాధరావుగారు నవ్వుతూ.

"ఏముందిసార్! మీ అబ్బాయి తనకు మా కాలేజీ అధ్యాపకులు, ప్రిన్సిపాలుగారు ఇచ్చిన ప్రోత్సాహం వలననే నాకీ ర్యాంకు వచ్చిందని చెబితే చాలు. ఇది యదార్థమే కూడా. దీంట్లో అసత్యమేమీ లేదు. ఏం రాజూ నిజమే కదా?" రాజుకేసి చూస్తూ నవ్వేరు.

పాపం రాజు ఇరకాటంలో పడ్డాడు. తండ్రి కేసి చూస్తూ మొహం కాస్త ఇబ్బందిగా పెట్టాడు.

"సారీ అండీ! నేనలా చెప్పించలేను. మా అబ్బాయి స్వతహాగా తెలివైనవాడు. ఎంతో కష్టపడి, కృషిచేసి ఈ ర్యాంకు తెచ్చుకున్నాడు" నిర్మొహమాటంగా చెప్పిన రంగనాధరావుగారి మాటలు విని, ప్రిన్సిపాల్‌గారు, కరస్పాండెంటుగారు అవాక్కయ్యారు.

"అదేమిటి సార్! రాత్రనక, పగలనక చదివించి ప్రతి వారాంతానికి టెస్టులు పెట్టి, ఎన్నో గ్రాండుటెస్టులు పెట్టి.." కొంచెం కోపం వచ్చినా, తమాయించుకుని అడిగేరు.

"మీరు తీసుకున్న ఫీజుకి ఇవ్వన్నీ చెయ్యాల్సిందే! మీరు తెలివైన కుర్రాళ్ళందరినీ మొదటి సెక్షనులో వేసి, కొంచెం తెలివైన వాళ్ళని రెండో సెక్షనులో వేసి, యావరేజి వాళ్ళని మూడు, నాలుగు సెక్షన్లలో వేసి, కేవలం మొదటి సెక్షనులో విద్యార్థులమీదే కాన్సెంట్రేట్ చేస్తారు. వారికి ర్యాంకులు వస్తే, అదంతా మా కృషే అంటారు. కానీ, స్వతహాగా వాళ్ళు తెలివిగలవాళ్ళవడం వలన, తల్లిదండ్రుల ప్రోత్సాహం వలన, కష్టపడి చదివి, ర్యాంకులు సంపాదించుకుంటారు. ఇక మీ కృషి అంటారా, మీరు చేసేది కనీస కృషి మాత్రమే! విద్యార్థుల మంచిచెడ్డలు మీరసలు పట్టించుకోరు. ఒకే హాలులో పశువుల్ని కట్టిపడేసినట్లు కట్టిపడేస్తున్నారు. వాళ్ళకి ఒకటో రెండో ఫేన్లు మాత్రమే పెడతారు. సరైన కుర్చీలుండవు. ఇంక టాయిలెట్స్ సంగతి చెప్పక్కరలేదు. మూడో, నాలుగో మాత్రమే వుంటాయి. భోజనం సంగతి సరేసరి. వేలకు వేలు గుంజుకుంటూ, కనీస రుచిగల భోజనం పెట్టరు. పశువులకి మేతపడేసినట్లు పడేస్తారు" ఇవన్నీ తమ కళ్ళారా ఎన్నోసార్లు చూసేరు కాబట్టి, తన ఆక్రోశాన్నంతా వెళ్ళగక్కారు రంగనాధరావుగారు.

"లేదుసార్! మీరు పొరబడుతున్నారు"

"నేను పొరబడలేదు. మా అబ్బాయిని కలవడానికి హాస్టలుకి చాలాసార్లు వచ్చాను. నేను కళ్ళారా చూసినవే చెప్పేను. జనానికి ఎమ్‌సెట్ పిచ్చివున్నంతవరకు, మీరిలా మాలాంటి వాళ్ళను దోచుకుంటూనే వుంటారు. మీ స్థాయి, ప్రతి యేడాది పెరుగుతూనే వుంటుంది. మా స్థాయి దిగజారుతూనే వుంటుంది. అంతే తేడా!" బాధగా చెప్పేరు రంగనాధరావుగారు.

"సార్! మీరు మరీ..."

"ఏం లేదు. మీకు కష్టమనిపించినా నిజాన్నే చెబుతున్నా"

ఆయన చెప్పినది నిజమని తెలిసినా, పైకి వెర్రి నవ్వు నవ్వుతూ "సార్! మీరు మా కాలేజీ గురించి, పాజిటివ్‌గా చెప్పకపోయినా ఫరవాలేదుకాని, దయచేసి నెగిటివ్‌గా చెప్పొద్దు ప్లీజ్" అంటూ లేచి నిష్క్రమించేరు ప్రిన్సిపాల్‌గారు, కరస్పాండెంట్‌గారు.

★